సాక్షి ఖమ్మం

గురువారం । 30 । జనవరి । 2025



ముహూర్తాలకు వేళాయె..

ఈనెల 30న మాఘమాసం ప్రారంభం కానుండగా, శుక్రవారం నుంచి నాలుగు నెలల పాటు శుభ ముహూర్తాలు ఉన్నాయి. 8లో



అటవీ భవనానికి వందేళ్లు

ఖమ్మం గాంధీచౌక్‌లోని అటవీ శాఖ పరిపాలన భవనానికి 100 ఏళ్లు నిండగా, శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 15°

వాతావరణం

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రికి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



లక్ష్మణ్

ఖమ్మం స్పోర్ట్స్ : డెహ్రాడూన్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కయం లక్ష్మణ్ ఎంపికయ్యాడు. ఇప్పటికే పలుమార్లు తిరుగులేని క్రీడాకారుడిగా గుర్తింపు పొందిన లక్ష్మణ్.. తాజాగా జాతీయ క్రీడల కోసం రాష్ట్రస్థాయిలో జరిగిన ఎంపికల్లో చక్కని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడల కు ఎంపికయ్యాడు. ఆలిండియా యూనివర్సిటీ క్రీడల్లో పాల్గొని ఆర్చరీలో పలుమార్లు బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడు. అసోసియేషన్ నిర్వహించిన జాతీయ జూనియర్ పోటీల్లో కాంస్య పతకం దక్కించుకున్నాడు. లక్ష్మణ్ జాతీ య స్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతీసారి ఉమ్మడి జిల్లాకు పతకం వస్తోందని, ఈసారి కూడా మెడల్ ఖాయమని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టా శంకరయ్య ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి జాతీయ క్రీడలకు ఎంపికైన లక్ష్మణ్ రాణించాలని ఆర్చరీ సంఘం అధ్యక్షుడు సాధుల సారంగపాణి, డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.క్రిష్టోఫర్‌బాబు, ఖేలో ఇండియా కోచ్ నగేష్ ఆకాంక్షించారు.

డీడీఎన్ నిధులు విడుదల

ఖమ్మంగాంధీచౌక్ : వెనుకబడిన ఆలయాల నిర్వహణకు రూపొందించిన ధూప దీప నివేదన(డీడీఎన్)పథకం నిధులు విడుదలయ్యాయి. 2024 నవంబర్, డిసెంబర్ నెలల పెండింగ్ బకాయిలను అర్చకుల ఖాతాల్లో దేవాదాయ శాఖ అధికారులు జమ చేశారు. ఖమ్మం జిల్లాలోని 330, భద్రాద్రి జిల్లాలోని 120 దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున వారి ఖాతాల్లో జమయ్యాయి.

'ఎస్సారెస్పీ' భూసేకరణకు అధికారుల పరిశీలన



భూసేకరణపై చర్చిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 54వ ప్యాకేజీలో సేకరించాల్సిన భూముల కోసం మండలంలోని ఇస్లావత్‌తండా నుంచి తిరుమలాయపాలెం వరకు ఆయా గ్రామాల్లోని ఎస్సారెస్పీ కాల్వలను సీడబ్ల్యూసీ అధికారులు శ్రీనివాస్, శరణ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుత భూముల విలువ, ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలపై స్థానిక ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. పాలేరు నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలో ఇంకా 15 ఎకరాల భూమిని కాల్వల నిర్మాణం కోసం సేకరించాల్సి ఉండగా, ఎన్ని నిధులు అవసరమనే విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈలు బాణాల రమేష్‌రెడ్డి, మన్మథరావు, ఏఈ వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీపీల రికార్డులు స్వాధీనం

ఖమ్మంరూరల్ : ఏదులాపురం కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటు కావడంతో అందులో విలీనమైన 12 గ్రామపంచాయతీల రికార్డులను మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఆయా గ్రామపంచాయతీల్లో ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చిన అనుమతులు, ఇంటి పన్నుల వివరాలతో పాటు జనరల్ ఫండ్ జమ, ఖర్చుల వివరాల రికార్డులను తీసుకుంటున్నారు. ఏదులాపురం పంచాయతీ కార్యాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్యాలయాన్ని కమిషనర్ అహ్మద్. షఫీఉల్లా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు కూడా రికార్డుల అప్పగింతకు సంబంధించిన వివరాలను సరిచూసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మొత్తంగా ఫిబ్రవరి 12 లోపు అన్ని రికార్డులను స్వాధీనం చేసుకుని, మున్సిపల్ పాలన కొనసాగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2న జాతీయ స్థాయి కరాటే పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్ : నగరంలోని వర్తక సంఘం భవనంలో ఫిబ్రవరి 2న జాతీయస్థాయి కరాటే పోటీలు జరుగుతాయని కరాటే స్కూల్ నిర్వాహకులు గోపతి సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరాటే, కుంగ్‌ఫూలో అన్ని కేటగిరిల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. గ్రాండ్ చాంపియన్‌షిప్ సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని, హాజరయ్యే క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు.



■ ఖళ్.. ఖళ్.. ఖళ్

విస్తరిస్తున్న క్షయ

జిల్లాలో ఏటా పెరుగుతున్న టీబీ బాధితులు

- వ్యాధిని అరికట్టేందుకు కేంద్రం నిధులతో ప్రయత్నం
- అయినా వెలుగు చూస్తూనే ఉన్న కేసులు
- జిల్లాలో గతేడాది కొత్తగా 2,314 మందికి వ్యాధి

జిల్లాలో నమోదైన కేసుల వివరాలు

ఏడాది	పరీక్షలు	కేసులు
2021	13,754	2,319
2022	15,768	2,580
2023	21,639	2,516
2024	25,847	2,314

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో క్షయ వ్యాధి తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. వయసుతో సంబంధం లేకుండా రోజురోజుకూ కేసులు పెరుగుతున్నాయి. సకాలంలో చికిత్స చేయించుకోకపోవడం, పరీక్ష చేయించుకున్నా మందులు సక్రమంగా వాడకపోవడం వంటి కారణాలతో బాధితుల సంఖ్య ఎక్కువ అవుతోంది. ఈ వ్యాధి వల్ల ఏటా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ప్రతీ రోజు 40 వేల మంది క్షయ వ్యాధికి గురవుతున్నారు. ప్రతీ ఒకటిన్నర నిమిషానికి ఒకరు మృత్యువాత పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇతర వ్యాధుల ద్వారా సంభవించే మరణాల కంటే క్షయ వ్యాధితోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలుస్తోంది. టీబీ వ్యాధి మైకో బ్యాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా సోకుతుంది. ఈ బ్యాక్టీరియా ఊపిరితిత్తులపై ప్రధానంగా ప్రభావం చూపిస్తుంది. టీబీ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి మరింత సులువుగా సోకుతుంది. రోగి దగ్గినప్పుడు, ఉమ్మివేసినప్పుడు, చీదినప్పుడు రోగ కారక క్రిములు గాలిలోకి చేరుతాయి. తద్వారా ఇవి మరొకరి శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఈ వ్యాధిగ్రస్తుడు దగ్గితే సుమారు 40 వేల వరకు వ్యాధికారక క్రిములు గాల్లో కలుస్తాయి. బాధితుల సంఖ్య క్రమంగా పెరగడానికి కారణం ప్రజల్లో అవగాహన లేకపోవడమే. టీబీ గుర్తింపు, నివారణ, అవగాహన కల్పించేందుకు అధికారులు గ్రామపంచాయతీల వారీగా క్లబ్‌లు ఏర్పాటు చేశారు. 2025లోగా టీబీ వ్యాధిని భారతదేశంలో నిర్మూలించాలనే లక్ష్యంతో క్లబ్‌ల రూపకల్పన చేశారు. అయితే జిల్లా టీబీ కంట్రోల్ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా ఆశించిన స్థాయిలో తగ్గుముఖం పట్టడం లేదు.

పీహెచ్‌సీల్లో తెమడ పరీక్షలు..

టీబీ వ్యాధిని గుర్తించేందుకు ప్రతీ పీహెచ్‌సీలో తెమడ పరీక్ష కేంద్రాలు అందుబాటులోకి తెచ్చారు. టీబీ కేసుల్లో టీబీ, ఎండీఆర్, ఎక్స్‌డీఆర్ అనే మూడు రకాలు ఉంటాయి. టీబీ సాధారణంగా 6 నెలలు మందులు వాడితే నయం అవుతుంది. కానీ ఎండీఆర్ వ్యాధికి గురైన వారు దీర్ఘకాలం మందులు వాడాలి. జిల్లాలో మల్టీ డ్రగ్ రెసిస్టెంట్(ఎండీఆర్) కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. మందులు వాడుతూ మధ్యలో ఆపేయడం, విచ్చలవిడిగా మందులు వాడడం వంటి వాటిని ఎండీఆర్ కేసులుగా పిలుస్తారు. ఎండీఆర్ కేసులకు చెందిన వారు 18 నెలలు మందులు వాడాల్సి ఉంటుంది. అయితే టీబీ డాక్టర్లు ప్రతీ కేసును ఎండీఆర్‌గా పరిగణనలోకి తీసుకుని చికిత్స అందిస్తున్నారు. ఎక్స్‌డీఆర్ కేసులను మాత్రం అత్యంత తీవ్రమైనవిగా పరిగణిస్తారు. ఈ బాధితులకు జిల్లా టీబీ ఆస్పత్రిలో నోడల్ డ్రగ్ రెసిస్టెంట్ సెంటర్‌లో చికిత్స చేస్తారు. ఎక్స్‌డీఆర్ ఉన్నవారికి బెడాక్విల్‌ఇన్ మందులు అందిస్తారు. ఈ మందు ప్రైవేటు ఆస్పత్రులు, మెడికల్ షాపుల్లో ఎక్కడా దొరకదు. ఎక్స్‌డీఆర్ కేసులకు 6 నెలల పాటు ఈ మందులు అందిస్తారు. మందులు తీసుకున్న పేషంట్ డోస్ పూర్తిచేశాక మరో ఆరునెలల పాటు ఈ మందు శరీరంలో పనిచేస్తుంది.

2,314 కేసులు నమోదు..

టీబీకి ప్రత్యేకమైన చికిత్స ఉన్నప్పటికీ అవగాహన లేమితో పలువురు వ్యాధి బారిన పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గతేడాది 2,314 మందికి ఈ వ్యాధి సోకినట్లు గుర్తించారు. గత నవంబర్ వరకు 25,847 మందికి పరీక్షలు చేయగా.. ఈ మేరకు కేసులు వెలుగుచూశాయి. ముఖ్యంగా ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరా తదితర అర్బన్ ప్రాంతాల్లో కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఒక టీబీ వ్యాధిగ్రస్తుడి ద్వారా 15నుంచి 20మందికి వ్యాప్తి చెందే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. క్షయ వ్యాధి ఊపిరితిత్తులకే కాక గుండె, కాలేయం, పేగులు, మెదడు, ఎముకలు వంటి వాటికీ సోకే ప్రమాదం ఉందంటున్నారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు టీబీ సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దగ్గినప్పుడు నోటి నుంచి రక్తం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటివి ఈ వ్యాధి లక్షణాలుగా చెప్పవచ్చు.

టీబీ వ్యాప్తిని అరికడుతున్నాం



జిల్లాలో టీబీ వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలో మూడు సార్లు జాతీయ స్థాయి సర్వే నిర్వహించాం. టీబీ నిర్మూలనలో జాతీయ స్థాయిలో ఆదర్శ జిల్లాగా పేరు సాధించాం. క్షయ నివారణకు పకడ్బందీ ప్రణాళిక చేపడుతున్నాం. టీబీ వ్యాధి లక్షణాలు, చికిత్సపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. దీర్ఘకాలికంగా దగ్గు ఉన్నా, ఆకలి మందగించినా, బరువు తగ్గినా సమీపంలోని పీహెచ్‌లో తెమడ పరీక్ష చేయించుకోవాలి. తద్వారా ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చు.

– వి.సుబ్బారావు, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి

ఎకో టూరిజం స్పాట్.. పులిగుండాల

- సందర్శకులు పెరిగేలా చర్యలు తీసుకుంటాం
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- కాలినడకన పులిగుండాల సందర్శన



కాలినడకన గుట్ట ఎక్కుతున్న కలెక్టర్

ఖమ్మంవన్‌టౌన్/పెనుబల్లి : అడవులను, ప్రాణ వాయువును అందించే ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. పచ్చని అడవి, ఆహ్లాదకర వాతావరణంలో కనువిందు చేస్తున్న పులిగుండాల ప్రాజెక్టును అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌తో కలిసి కలెక్టర్ సుమారు 5 కిలోమీటర్ల మేర అటవీ మార్గం గుండా కాలినడకన గుట్ట పైకి ఎక్కి సందర్శించారు. పాలపిట్ట ఏరియల్ టవర్ ఎక్కి బైనాక్యులర్‌తో చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పులిగుండాల ప్రాజెక్టును ఎకో టూరిజం ప్రాంతంగా ఫిబ్రవరి నుంచి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రకృతి పరంగా అందమైన గుట్టలు, చెరువు, గుట్టల నుంచి జాలువారే నీటితో ఉన్న అడవిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకోవాలని, దీంతో ఆరోగ్యమనే సంపద వస్తుందని అన్నారు. పర్యాటకుల కోసం చెరువులో బోటింగ్, వసతి కోసం కాటేజీలు, భోజనం, తాగునీరు వంటివి ఏర్పాటు చేసి, పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చెరువులో సంచరించే పక్షులు, పులిగుండాల చరిత్ర చెప్పేలా వినూత్న కార్యక్రమాల నిర్వహణకు గైడ్‌లు కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. పిల్లలకు సైక్లింగ్, ఓపెన్ జిమ్, అడ్వెంచర్ యాక్టివిటీస్ వంటివి అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, ఎఫ్ఆర్ఓ జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అడవిలో నడుస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఎఫ్ఓ, కమిషనర్ తదితరులు

విద్యుత్ అంతరాయాలను నియంత్రించాలి

సమ్మర్ యాక్షన్ ప్లాన్ సమీక్షలో నోడల్ అధికారి నాగప్రసాద్



మాట్లాడుతున్న నాగప్రసాద్, పక్కన సురేందర్, శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం : వేసవిలో అంతరాయాలు లేని విద్యుత్ సరఫరాకు అంతా సమష్టిగా కృషి చేయాలని నోడల్ అధికారి జి.నాగప్రసాద్ సూచించారు. ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవి విద్యుత్ కార్యాచరణ ప్రణాళిక మేరకు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రులు, ఇతర అత్యవసర సర్వీసులకు ప్రత్యామ్నాయ పద్ధతిలో విద్యుత్ సరఫరాకు ఇంటర్ లింకింగ్ లైన్స్ వ్యవస్థలను పటిష్ట పర్చాలన్నారు. అంతరాయాల సమస్య పరిష్కారానికి ఎమర్జెన్సీ రెస్టోర్ టీం వాహనాలను ఉపయోగించాలని తెలిపారు. ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్ మాట్లాడుతూ.. వేసవిలో విద్యుత్ సమస్యలను దృష్టిలో పెట్టుకొని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 13 సబ్ స్టేషన్లలో లోడ్‌కు అనుగుణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని తెలిపారు. అధిక లోడ్ పడకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసరావు, డివిజనల్ ఇంజినీర్లు నాగేశ్వరరావు, రామారావు, రాములు నాయక్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మోగిన నగారా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షెడ్యూల్ విడుదల

- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, ఆ రోజు నుంచి 10 వరకు నామినేషన్లు
- 11న పరిశీలన.. 13న ఉపసంహరణ
- 27న పోలింగ్, మార్చి 3న ఫలితాలు

ఖమ్మం సహకారనగర్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేయడంతో కోలాహలం మొదలైంది. ఇప్పటి వరకు పోటీలో నిలిచేందుకు ఆసక్తి చూపించిన వారు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రచారం చేయగా.. షెడ్యూల్ ప్రకటనతో ఆశావహులు ప్రచారం ముమ్మరం చేయనున్నారు. వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇటీవల ఓటర్ల నమోదు ప్రక్రియ ఇటీవలే పూర్తయింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 24 పోలింగ్ బూత్‌లు ఉండగా 3,955 మంది ఓటర్లుగా తేలారు. ఇందులో పురుషులు 2,300, మహిళలు 1655 మంది ఉన్నారు. భద్రాద్రి జిల్లాలో 23 మండలాల పరిధిలో 23 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 1,949 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,038 మంది, మహిళలు 941 మంది ఉన్నారు. ఇంకా అర్హులైన వారు ఉంటే ఈనెల 31 వరకు కూడా ఓటు నమోదుకు అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

అమల్లోకి వచ్చిన కోడ్..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లవుతుంది. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్(ఎఫ్ఎస్‌టీ), మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీఎంసీ), వీడియో సర్వైలెన్స్ టీమ్(వీఎస్‌టీ) ఏర్పాటుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడనుండగా ఆ రోజు నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు 13 వరకు అవకాశం ఉంటుంది. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, మార్చి 3న కౌంటింగ్, అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే ఉపేక్షించం

కేయూ పరీక్షల నియంత్రణ అధికారి రాజేందర్



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న రాజేందర్

ఖమ్మం సహకారనగర్ : పరీక్షల్లో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదని కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ అన్నారు. నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, మ్యాక్స్ ఫార్మసీ కళాశాల పరీక్ష కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాపీయింగ్‌కు తావులేకుండా విజయవంతంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు తెలిపారు. పీజీ కళాశాలలో పీజీ థర్డ్ సెమిస్టర్ విద్యార్థులు నలుగురు, కవిత కళాశాలలో ఇద్దరు, మ్యాక్స్ కళాశాలలో ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు పట్టుబడగా వారిని డీబార్ చేశామన్నారు. ఆయన వెంట అదనపు పరీక్షల నిర్వహణ అధికారి ప్రొఫెసర్ సౌజన్య తదితరులు ఉన్నారు.

రామయ్యకు స్నపన తిరుమంజనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామచంద్రస్వామి వారికి బుధవారం స్నపన తిరుమంజనం జరిపించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు నిర్వహించారు.

పండ్ల మార్కెట్‌కు సన్నాహాలు

- ఖానాపురం హవేలీలో మూడెకరాల విస్తీర్ణంలో..
- స్థలం కేటాయింపు పనుల్లో ప్రభుత్వ శాఖలు



ఖమ్మంవ్యవసాయం : ఖమ్మం నగరంలోని ఖానాపురం హవేలీలో మూడెకరాల విస్తీర్ణంలో హోల్‌సేల్ పండ్ల మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఖానాపురం హవేలీలోని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌కు కేటాయించిన స్థలంలో కొంత భాగం, దానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వం స్థలం మొత్తం మూడెకరాల విస్తీర్ణంలో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ, రెవెన్యూ శాఖలు స్థలం కేటాయించే పనిలో ఉన్నాయి. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఖమ్మంలో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు బాధ్యతలను జిల్లా మార్కెటింగ్ శాఖకు అప్పగించింది. దీంతో మార్కెటింగ్ శాఖ అధికారులు స్థలం కేటాయింపుపై కలెక్టర్ తదితరులను సంప్రదిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో ఖానాపురం హవేలీలో ఉన్న స్థలాన్ని ఫ్రూట్ మార్కెట్‌కు కేటాయించే అవకాశం ఉందని డీఎంఓ ఎంఏ అలీం తెలిపారు. రాష్ట్రంలో ఉద్యాన పంటలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా పెట్టింది పేరు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పండ్ల తోటల విస్తీర్ణం అధికంగా ఉంది. పండించిన పంటలను రైతులు దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించాల్సి వస్తోంది. లేదంటే దళారులను ఆశ్రయించాల్సిందే. దీంతో ఖమ్మంలో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటు చేయాలని రైతులు, పండ్ల వ్యాపారులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూనే ఉన్నారు. గతంలో ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్‌లో హోల్ సేల్ కూరగాయల మార్కెట్‌కు ఆనుకొని ఉన్న డీఆర్‌డీఏలో ఉన్న ఖాళీ స్థలాన్ని ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటుకు పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో 60 వేల ఎకరాల్లో మామిడి, 8 వేల ఎకరాల్లో అరటి, 2 వేల ఎకరాల్లో జామ, బొప్పాయి 5 వేలు, నిమ్మ 2 వేలు, పుచ్చ 4 వేలు, ఇతర పంటలు మరో 20 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు ఉద్యాన అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రధానంగా పండించే మామిడి రకాలు బంగనపల్లి, హిమాయిత్, రసాలు వంటివి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి అవుతుంటాయి. అయితే స్థానికంగా మార్కెట్ లేకపోవటంతో రైతులు దళారుల ద్వారా పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, మధిర, ఖమ్మం, కూసుమంచి, ఇల్లెందు, కొత్తగూడెం ఉద్యాన డివిజన్లలో అధిక విస్తీర్ణంలో పండ్ల తోటలు ఉన్నాయి. ఈ ప్రాంతాల రైతులకు ప్రయోజకరంగా ఉండేలా ఖమ్మంలో ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అవసరమైతే ఈ మార్కెట్‌కు అనుసంధానంగా పండ్లను మాగించేందుకు రైపనింగ్ చాంబర్లను కూడా అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర బీచ్ వాలీబాల్ శిక్షణ శిబిరం పూర్తి



రాష్ట్ర బీచ్ వాలీబాల్ జట్లు

ఖమ్మంస్పోర్ట్స్: జాతీయ క్రీడల్లో పాల్గొనే జట్టుకు నగరంలోని సీక్వెల్‌లో పదిహేను రోజులుగా బీచ్ వాలీబాల్ శిక్షణ శిబిరం నిర్వహించగా బుధవారం ముగిసింది. ఇక్కడ పాల్గొన్న క్రీడాకారుడులు డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటారు. జాతీయ క్రీడల్లో పాల్గొనే బీచ్‌వాలీబాల్ జట్టుకు వాలీబాల్ కోచ్ ఎండీ అక్బర్‌అలీ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. జీఎస్టీ అధికారి దేవర పట్టాభి, దివంగత డీఎస్‌డీఓ, ఫుట్‌బాల్ క్రీడాకారుడు సయ్యద్ సుభాన్ జ్ఞాపకార్థం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్‌లు ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కోయచెలకలో ప్రత్యేక సర్వే



చిన్నారులతో ముచ్చటిస్తున్న ట్రైనీ కలెక్టర్

రఘునాథపాలెం: మండలంలోని కోయచెలక గ్రామంలో బుధవారం ట్రైనీ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోనే గడిపారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పాఠశాలను పరిశీలించారు. గ్రామస్థాయిలో వివిధ శాఖల సిబ్బందితో మాట్లాడి ఆయాశాఖల నివేదికలను అడిగి తెలుసుకున్నారు. పొదుపు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ దీపికల పనులు, గర్భిణులు, వ్యాధులు, గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో కింద కూర్చొని చిన్నారులతో ముచ్చటించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థిని శ్రావణి మృతితో ఉన్నత పాఠశాలకు సెలవు ఇచ్చారు. కొన్ని కుటుంబాలను ఎంపిక చేసుకొని సర్వే చేశారు.

తల్లాడలో ఆయిల్ ఇంజన్ చోరీ

తల్లాడ: స్థానిక కేతినేని థియేటర్ పక్కన అన్నారుగూడెం – తల్లాడ రోడ్డులో ఉన్న ఓ వరి పొలంలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజన్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. తల్లాడకు చెందిన రైతు గరిడేపల్లి బుచ్చయ్య తన వరి పొలానికి నీళ్లు పెట్టుకొనేందుకు పొలం సమీపంలో ఉన్న బావికి ఆయిల్ ఇంజన్ ఏర్పాటు చేసుకున్నాడు. పగలు పొలానికి నీరు కట్టి ఇంటికి రాగా రాత్రి సమయంలో ఆయిల్ ఇంజన్‌ను ఎత్తుకెళ్లారు. బుధవారం వెళ్లి పొలంలో చూడగా ఆయిల్ ఇంజన్ కనిపించలేదు. దీని విలువ రూ.15 వేలు ఉంటుందని రైతు తెలిపాడు. దీనిపై తల్లాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. వారం రోజుల కిందట ఇదే రోడ్డులో మిర్చి తోటలో కోసి ఉంచిన ఐదు బస్తాల పండు కాయలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీనిపై కూడా ఆ రైతు దగ్గుల శ్రీనివాస రెడ్డి తల్లాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కూసుమంచి: మండలంలోని గంగబండతండా వద్ద బుధవారం టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. జుజుల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసు పిచ్చయ్యాచారి తన ద్విచక్ర వాహనంపై తండా నుంచి ఇంటికి వెళ్తున్నాడు. వెనుక నుంచి వచ్చిన వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో అతని తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.


వ్యక్తి అదృశ్యం

చింతకాని: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో షేక్ యూసుఫ్ కనిపించకుండా పోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 25వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన యూసుఫ్ తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవటంతో తండ్రి పాషా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ఖమ్మంఅర్బన్: నగరంలోని యూపీహెచ్ కాలనీకి చెందిన దొంతురాజు నరేశ్ కనిపించకుండా పోవడంతో బుధవారం ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. 4 రోజుల కిందట బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అనేక చోట్ల ఆరా తీసినా ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భానుప్రకాష్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

ముహూర్తాలకు వేళాయె..

నేటి నుంచి మాఘమాసం..
రేపటి నుంచి శుభ ఘడియలు



ఖమ్మంగాంధీచౌక్ : శుభకార్యాలకు వేళయింది. ముహూర్తాల కాలం వచ్చింది. గురువారం నుంచి మాఘమాసం ప్రారంభమవుతుండగా, శుక్రవారం నుంచి శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఈ మాసంలో వివాహాది శుభకార్యాలు జరుపుకునేందుకు అంతా ప్రాధాన్యం ఇస్తుంటారు. 'మఘం' అంటే యజ్ఞం, యాగాదులకు మాఘమాసం ప్రత్యేకమైనది. ఇది విష్ణుమూర్తికి ప్రీతిప్రదమైన మాసం కాగా, వ్రతాలు, వివిధ దేవతలకు పూజలు చేస్తుంటారు.

రేపటి నుంచి బాజాల మోత..

ఈనెల 31వ తేదీ నుంచి శుభ ఘడియలు ప్రారంభమై జూన్ ఆరంభం వరకు కొనసాగనున్నాయి. ఈ సమయంలో పెళ్లితో పాటు ఇతర శుభ ముహూర్తాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. మధ్యలో మార్చి 13 నుంచి ఏప్రిల్ 13 వరకు మాత్రం ఎలాంటి ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు. జనవరి 31, ఫిబ్రవరి 2, 3, 7,13, 14, 15, 18, 19, 20, 21, 23, 25 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి. మార్చిలో 1, 2, 6, 7, 12 తేదీల్లో, ఏప్రిల్‌లో 14, 16, 18, 19, 20, 21, 25, 29, 30 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. మే లో 1, 5, 6, 8, 15, 17, 18 తేదీలతో పాటు జూన్ 1, 2, 4, 7 తేదీల్లో కూడా శుభ ముహూర్తాలు ఉన్నాయి. పెళ్లిళ్లతో పాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, ఇతర శుభ కార్యాలు చేసుకోవచ్చని పండితులు చెబుతున్నారు.

మాఘమాసంలో వివాహాలకు ప్రాధాన్యం..

మాఘమాసం అంటే వివాహాలకు పెట్టింది పేరు. ఈ మాసంలో వివాహాలు చేసుకోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలు ఈ కాలంలో అంతగా ఉండవు. చలితో పాటు ఎండల తీవ్రత కూడా తక్కువగానే ఉంటుంది. రైతులకు కూడా వ్యవసాయ పనులు అంతగా ఉండవు. దీంతో ఈ సీజన్‌లో వివాహాలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. ఇతర శుభ కార్యక్రమాలు జరుపుకోవటానికి కూడా అనుకూలంగా ఉంటుంది.

నూతనోత్సాహంతో సన్నద్ధం..

వివాహాది శుభకార్యాలు అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు నూతనోత్సాహంతో పలువురు ముందుకు సాగుతున్నారు. వివాహాలు తలపెట్టిన వారు సంప్రదాయ పద్ధతుల్లో పనులు ప్రారంభిస్తారు. శుభ పత్రికలు ప్రింట్ చేయించి పంపిణీకి కూడా చర్యలు చేపడుతున్నారు. వస్త్రాలు, బంగారం, వివాహానికి అవసరమైన సామగ్రి కొనుగోళ్లలో నిమగ్నమవుతున్నారు. నగరాలు, పట్టణాల్లో ఫంక్షన్ హాళ్లను కొందరు ఇప్పటికే బుక్ చేసుకోగా, మరికొందరు బుక్ చేసుకునే పనిలో ఉన్నారు. గ్రామాల్లో ఇళ్ల ముందు వివాహాలు జరుపుకునే వారు రంగులు వేసుకోవడం, శుభ్రం చేసుకోవడం, టెంట్లు, వంట సామగ్రిని వంటివి ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక బ్యాండ్, సన్నాయి మేళాలు, వీడియో, ఫొటో గ్రాఫర్లు, మండపం డెకరేషన్, వంట మనుషులు, కేటరింగ్ వంటి వాటికి ఆర్డర్లు ఇస్తున్నారు. విదేశాల్లో ఉండేవారు కూడా స్వదేశానికి వచ్చి మాఘమాసంలో పెళ్లిళ్లు చేసుకొని వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మాఘమాసం ప్రత్యేకం



మాఘమాసం వివాహాలకు ప్రత్యేకం. ఈ మాసంలో వివాహాలు జరిపేందుకు అంతా ఇష్ట పడుతారు. జనవరి 31వ తేదీ నుంచి శుభ ముహూర్తాలు ఉన్నాయి. మాఘమాసంలో వివాహాది శుభ కార్యాలకు అంతా ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం సుదీర్ఘ కాలంపాటు సుముహూర్తాలు ఉన్నాయి. ఈ కాలంలో పెద్ద సంఖ్యలో వివాహాలకు నిశ్చయించుకున్నారు. జూన్ నెల ఆరంభం వరకు పెళ్లిళ్లు, ఇతర శుభ ముహూర్తాలు ఉన్నాయి.

– మునగలేటి రమేష్ శర్మ, జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు

అటవీ భవనానికి వందేళ్లు

శతాబ్ది ఉత్సవాలకు అటవీశాఖ సన్నద్ధం



వందేళ్లు పూర్తి చేసుకున్న అటవీశాఖ భవనం

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నగరంలోని గాంధీచౌక్ ప్రాంతంలో ఉన్న అటవీశాఖ పరిపాలన భవనానికి 100 ఏళ్లు నిండాయి. 1925లో నిజాం ప్రభుత్వం రైల్వేస్టేషన్ సమీపంలోని ట్రంక్‌రోడ్డులో ఈ భవనం నిర్మించి, అటవీశాఖ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పా టు చేసింది. వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జిల్లా అటవీశాఖ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించ నుంది. అందులో భాగంగా వారం రోజులు పాఠశాల విద్యార్థులతో పట్టణ ఉద్యానవనాల్లో వనదర్శిని కార్యక్రమం, పులిగుండాల ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక పర్యటనలు, కనకగిరి కొండల వద్ద పక్షులు, వన్యప్రాణుల సర్వే, ఖమ్మం అటవీ సముదాయంలో అటవీశాఖ అధికారుల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు, సత్తుపల్లి డివిజన్‌లో నూతన భవనాల ప్రారంభోత్సవాలు, ఫారెస్ట్ కాంప్లెక్స్ ఖమ్మంలో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో 100 ఏళ్ల వేడుక సమావేశాల నిర్వహణ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ తెలిపారు.

మహిళలకు రాజకీయాధికారం కల్పించాలి



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు రాజకీయ అధికారం లేకుండా వారి సమస్యలు పరిష్కారం కావని, స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అయినా రాజకీయ అధికారం అడుక్కోవడం సిగ్గుచేటని బాగం హేమంతరావు అన్నారు. మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) ఖమ్మం జిల్లా జనరల్‌బాడీ సమావేశం బుధవారం పోటు కళావతి అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించగా బాగం మాట్లాడారు. రాజకీయ పార్టీలకు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మహిళలు గుర్తుకొస్తారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని విస్మరిస్తున్నారన్నారు. మహిళా సాధికారతపై మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా లభ్యమవడంతో వాటికి బానిసలైన యువత మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని తెలిపారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు చేసినప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, మహిళ సమాఖ్య నిర్మాణ సంఘం బాధ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, నాయకులు మండడపు రాణి, కన్నెబోయిన విజయమ్మ, కర్నాటి నళిని, సోమోజుల సరోజనమ్మ, ఎస్కే రంజాబీ, మహ్మద్ జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం ఆటో అడ్డగింత..

- బెల్టు షాపుల్లో ఎమ్మార్పీకే అమ్మాలని మాణిక్యారంవాసుల డిమాండ్
- ఎక్సైజ్ ఎస్‌ఐ, సిబ్బందితో వాగ్వాదం



ఎక్సైజ్ ఎస్‌ఐ వసంతలక్ష్మితో మాట్లాడుతున్న గ్రామస్తులు

కారేపల్లి: ఎమ్మార్పీ కంటే అదనంగా డబ్బు తీసుకుని మద్యం విక్రయిస్తున్నారని, మద్యం బాటిళ్లను ఆటోల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు అడ్డుకున్న ఘటన మండలంలోని మాణిక్యారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. మాణిక్యారం మాజీ సర్పంచ్ భూక్యా రంగారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉదయాన్నే గ్రామంలోకి వచ్చిన మద్యం ఆటోను అడ్డుకుని, గ్రామ పంచాయతీ కార్యాలయానికి తరలించి, సుమారు రూ.2 లక్షల విలువ చేసే మద్యం బాక్సలను గదిలో భద్రపరిచి తాళం వేశారు. ఆటోను పంచాయతీ గేటుకు గొలుసులతో కట్టేశారు. సమాచారం అందుకున్న కారేపల్లి ఎక్సైజ్ ఎస్‌ఐ వసంతలక్ష్మి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మద్యంతో పాటు ఆటోను వదిలి పెట్టాలని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు ఎమ్మార్పీ కంటే రూ.20 అదనంగా బెల్టు షాపులకు మద్యం విక్రయిస్తున్నారని, వారు మరో రూ.20 అదనంగా తీసుకొని మొత్తంగా క్వార్టర్‌పై రూ.40 అదనంగా వసూళ్లు చేస్తూ దోచుకుంటున్నారన్నారు. ఇలా గతంలో జరిగిన ఓ ఘటనను సైతం ఉదాహరణగా చెబుతూ గ్రామస్తులు ఎక్సైజ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో ఎక్సైజ్ ఎస్‌ఐ వసంతలక్ష్మి, సిబ్బంది వచ్చిన వాహనంలోనే వెనుతిరిగారు.

పోలీసులపై అసత్య ఆరోపణలు తగవు

ముదిగొండ సీఐ మురళి



మాట్లాడుతున్న గొల్లమూడి స్వప్న

ముదిగొండ/ఖమ్మంమామిళ్లగూడెం: గత డిసెంబర్ 25న మండలంలోని ముత్తారం గ్రామంలో గొల్లమూడి కేశవ్ (21) చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకున్ని ఆత్మహత్య చేసుకున్న కేసు దర్యాప్తు కొనసాగుతోందని, పోలీసులపై అసత్య ఆరోపణలు తగవని సీఐ మురళి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేశవ్ చనిపోయిన విషయం 26న తెలియడంతో అక్కడికి చేరుకోగా.. వారి బంధువులు మృతదేహాన్ని కిందికి దించారని, దీంతో పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించామని తెలిపారు. మృతుడి అక్క స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, అనుమానితులుగా ఉన్న బాలికతో పాటు మరో ఇద్దరిని విచారించామని, ఆధారాలు దొరక్కపోవడంతో వారి సెల్‌ఫోన్లను సైతం సైబర్ ల్యాబ్‌కు పంపి, తిరిగి అప్పగించామని వెల్లడించారు. పోస్టుమార్టంలోనూ ఉరివేసుకుని మృతిచెందినట్లు తేలిందని, కేశవ్ మృతిచెందిన రోజు విద్యుత్ సరఫరా కూడా ఉందని స్పష్టం చేశారు. ఎఫ్‌ఐఆర్, పోస్టుమార్టం నివేదికలను కుటుంబ సభ్యులకు అప్పగించామని, కానీ, కేశవ్ కుటుంబ సభ్యులు పోలీసులపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని సీఐ వివరించారు. కాగా, తన తమ్ముడిది ఆత్మహత్య కాదని, విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కేశవ్ సోదరి స్వప్న, కుటుంబ సభ్యులు కోరారు. బుధవారం వారు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. పోలీసులు తప్పుడు పోస్టుమార్టం నివేదిక ఇచ్చారని ఆరోపించారు. తనతోపాటు తల్లి, నాయనమ్మ, తాతయ్యను సైతం మీ తమ్ముడిని చంపినట్లు చంపుతామని బెదిరింపులు వస్తున్నాయని తెలిపారు. సమావేశంలో మరియమ్మ, భారతమ్మ, నాగయ్య, కుమారి, భద్రమ్మ, సునీత, మార్తమ్మ, నవీన్, ప్రసాద్, ఏసు పాల్గొన్నారు.

కోయచెలకలో విషాదం

- బడిలో కింద పడిపోయిన బాలిక చికిత్స పొందుతూ మృతి
- మృతిపై అనుమానాలెన్నో..



శ్రావణి (ఫైల్)



ఆర్థిక సాయం అందిస్తున్న యండపల్లి సత్యం

రఘునాథపాలెం: నృత్యం చేస్తూ కిందపడిపోయిన బాలిక.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని కోయచెలక గ్రామంలో విషాదాన్ని నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కోయచెలకకు చెందిన పొట్ట మరియమ్మ కుమార్తె శ్రావణి (15).. ఈ నెల 25న గణతంత్ర దినోత్సవం సందర్భంగా నృత్యం చేసేందుకు తోటి విద్యార్థులతో కలిసి డాన్స్ ప్రాక్టీస్ చేస్తోంది. ఈ క్రమంలో తాను కిందపడిపోయింది. తర్వాత స్పృహలోకి వచ్చి ఇంటికి వెళ్లి తల్లి మరియమ్మతో ఒంట్లో నలతగా ఉందని చెప్పింది. దీంతో ఆమె కుమార్తెను ఆస్పత్రికి తరలించింది. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే, పాఠశాలలో కిందపడినప్పుడు బలమైన గాయం తగిలిందా? లేక ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తాయా? లేక గుండెపోటుతో మరణించిందా అనే తెలియడం లేదని తల్లి మరియమ్మ, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని బుధవారం పాఠశాల హెచ్‌ఎం శిరీష దృష్టికి తీసుకెళ్లగా.. శిరీష కిందపడినట్లు తనకు తెలియదని, తోటి విద్యార్థులను ఆరాతీయగా పడిపోయి తానే లేచినట్లు తెలిపారని హెచ్‌ఎం వివరించారు. శ్రావణి తండ్రి కొన్నేళ్ల కిందట మృతిచెందగా.. ప్రస్తుతం శ్రావణి మృతితో మరియమ్మ రోదనలు మిన్నంటాయి. మరియమ్మ పెద్ద కుమార్తెకు వివాహమైంది. కాంగ్రెస్ నాయకులు యండపల్లి సత్యం శ్రావణి మృతదేహాన్ని సందర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెరుకూరి పూర్ణ నివాళులర్పించారు. కాగా, మరియమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలి



సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న జీసీడీఓ శిరీష

కూసుమంచి: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరం విద్యార్థులు, యువత కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సమగ్ర శిక్ష రాష్ట్ర బాలికాభివృద్ధి శాఖ అధికారి (జీసీడీఓ) డాక్టర్ శిరీష అన్నారు. బుధవారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గిరిజన విద్యార్థుల సాంస్కృతిక సమ్మేళనాన్ని ఆమె డీఈఓ సోమశేఖరశర్మతో కలిసి ప్రారంభించారు. రాష్ట్రంలో గిరిజన విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. గిరిజన సంస్కృతిపై నేటి తరానికి అవగాహన ఉండాలని, గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జీసీడీఓ అన్నారు. డీఈఓ సోమశేఖరశర్మ మాట్లాడుతూ.. గిరిజనులు అంటే అందరికీ ఎంతో గౌరవం కలుగుతుందని, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో చరిత్రను కలిగి ఉన్నాయని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా జీసీడీఓ తులసి, ఎంఈఓ రాయల వీరస్వామి, ఏఎంఓ రవికుమార్, సీఎంఓ రాజశేఖర్, మాదాసు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పిండిప్రోలు జీపీలో డీపీఓ తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీపీఓ ఆశాలత

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామ పంచాయతీని బుధవారం జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్మశానవాటిక, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీ, సైడ్ డ్రైయినేజీలను పరిశీలించి పలు సూచనలిచ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, రికార్డులను పూర్తిస్థాయిలో నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ పి.సూర్యనారాయణ, హెచ్‌ఎం జ్యోతి, పంచాయతీ కార్యదర్శి టి.రాము పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య దీక్ష

- ప్రేమించి పెళ్లి చేసుకొని ముఖం చాటేసిన భర్త



భర్త ఇంటి ఎదుట దీక్షకు దిగిన పూజిత

బోనకల్: ప్రేమించి పెళ్లి చేసుకుని, కాపురానికి తీసుకెళ్లకపోవడంతో సదరు మహిళ ఆ భర్త ఇంటి ఎదుటనే దీక్షకు దిగిన ఘటన బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బ్రాహ్మణపల్లికి చెందిన మడుపల్లి గోపికృష్ణ, కలకోట గ్రామానికి చెందిన శవల పూజిత ఏడాది కిందట ప్రేమించుకున్నారు. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. గోపికృష్ణ తల్లిదండ్రులు వీరి ప్రేమను అంగీకరించలేదు. అబ్బాయి బంధువులు, అమ్మాయి తల్లిదండ్రులు ఏడాది కిందట ఖమ్మంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పెళ్లి చేశారు. ఆ రోజు సాయంత్రం గోపికృష్ణ హైదరాబాద్‌లో తాను పనిచేస్తున్న ఉద్యోగం వద్దకు వెళ్లాడు. తరువాత అమ్మాయిని తీసుకెళ్తానని చెప్పి నమ్మించాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా రాకపోవడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. కొంతకాలం తరువాత తీసుకెళ్తానని చెప్పాడు. కానీ, తీసుకెళ్లక పోవడంతో మరోసారి పెద్దలను అడుగగా అయ్యప్ప మాల ధరించానని, తరువాత తీసుకెళ్తానని నమ్మించాడు. ఎంతకు రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోక బ్రాహ్మణపల్లిలో భర్త ఇంటి ఎదుట తల్లిదండ్రులతో కలిసి పూజిత దీక్షకు దిగింది. భర్త కుటుంబీకులు తాము చేసేదేమీ లేదని చెప్పడంతో దీక్షను కొనసాగిస్తోంది.

వ్యక్తి ఆత్మహత్య

తిరుమలాయపాలెం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో గొడవపడి గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన చెవుల ఉపేందర్ (28) కొన్నేళ్లుగా మద్యానికి బానిసగా మారాడు. మంగళవారం భార్య గంగాభవానీతో గొడవపడి గడ్డిమందు సేవించాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురంలో పోతురాజు వెంకటేశ్వర్లుకు చెందిన వరి గడ్డివామి మంగళవారం అర్ధరాత్రి దగ్ధమైంది. గ్రామ చివరన సుమారు 400 కట్టలను వామిగా పేర్చగా గడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయిందని బాధిత రైతు వాపోయాడు. సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు తెలిపాడు.